MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక






ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 21 | గురువారం 22 జనవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-




## ఝార్ఖండ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

- ఎన్‌కౌంటర్‌లో 15 మంది నక్సల్స్ మృతి
- మావోయిస్టుల ఏరివేత ముమ్మరం
- సారండా అడవుల్లో భద్రతా దళాల వేట
- 2026 మార్చి నాటికి దేశాన్ని మావోయిస్ట్ రహితంగా మార్చాలన్నది కేంద్రం లక్ష్యం

# 2035 నాటికి ఏపీ 'డే-జీరో రెడీ స్టేట్'

- దావోస్‌లో మంత్రి నారా లోకేశ్
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ముందుకెళుతున్న ఏపీ
- 2035 నాటికి 'డే-జీరో రెడీ స్టేట్'గా మారడమే లక్ష్యం
- గత 18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు అమలు చేసినట్టు వెల్లడి
- ప్రతి జిల్లాలో ఎంఎస్‌ఎంఈ ఆధారిత వృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- దావోస్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన మంత్రి లోకేశ్



అంకుశం ప్రత్యేక ప్రతినిధి దావోస్

ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ పారిశ్రామిక విధానంలో సరికొత్త అధ్యాయాన్ని ఆవిష్కరించింది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వైపు అడుగులు వేస్తున్నామని, పెట్టుబడులను వారాల వ్యవధిలోనే కార్యరూపంలోకి తెచ్చేలా 2035 నాటికి రాష్ట్రాన్ని 'డే-జీరో రెడీ స్టేట్'గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నమ్మకం, వేగం అనే రెండు అంశాలు ఏపీని కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా మారుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దావోస్‌లో జరిగిన 'ద ఫాస్ట్ లేన్: ఇన్వెస్టింగ్ ఎట్ ది స్పీడ్ ఆఫ్ గ్రోత్' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి సమయం ఆదా చేయడమే అతిపెద్ద లాభం. ఇదే రాష్ట్రానికి ఆర్థిక పోటీలో ఆధిక్యతను

- మిగతా3లో




## రాజకీయాల్లోకి విజయసాయిరెడ్డి రీఎంట్రీ.!

- లిక్కర్ స్కాంలో పాల్గొన్నవారే అసలు విషయాలు చెప్పాలని ఈడీ అధికారులకు తాను సూచించా
- వైసీపీలో నెంబర్-2 స్థానం అనేది ఉండదు
- పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డే ఒకటి నుంచి వంద వరకు అన్నీ అన్నట్టుగా వ్యవహరిస్తారు
- తన ఆస్తుల వివరాలన్నింటినీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా
- తాను రాజకీయ సన్యాసం తీసుకోలేదు
- వచ్చే జూన్ 25 తర్వాత మళ్లీ రాజకీయాల్లోకి రీఎంట్రీ ఇస్తా

హైదరాబాద్/అమరావతి

లిక్కర్ స్కాం అంశంలో తనకు ఎలాంటి సంబంధం లేదని వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. తన దృష్టిలో అసలు లిక్కర్ స్కాం అనే విషయమే లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. లిక్కర్ స్కాంలో పాల్గొన్నవారే అసలు విషయాలు చెప్పాలని ఈడీ అధికారులకు తాను సూచించానని విజయసాయిరెడ్డి తెలిపారు. ఈ విచారణలో తన స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డు

- మిగతా3లో



## లోయలో పడిన ఆర్మీ వాహనం..

- 10 మంది సైనికులు మృతి
- జమ్మూకశ్మీర్ లోని దోడా జిల్లాలో ఘోర ప్రమాదం
- 200 అడుగుల లోతులోకి పడిపోయిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం
- గాయపడిన సైనికులు మిలిటరీ ఆసుపత్రికి తరలింపు

## రైతుల తర్వాత ఇప్పుడు కార్మికులా?

- నల్ల చట్టాల మాదిరిగానే కొత్త కుట్ర
- అదానీ, అంబానీల కోసమే ఇదంతా
- మహాత్మా గాంధీ పేరును చెరిపేసే ప్రయత్నం
- కొన్నేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది
- బడ్జెట్ సమావేశాల్లో తేల్చుకుంటాం: మల్లికార్జున ఖర్గే



## పార్లమెంట్ ప్రజా సమస్యలపై పోరాడండి

- వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అధ్యక్షతన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం, హాజరైన ఎంపీలు
- రాష్ట్ర ప్రజల కష్టాలు, సమస్యలు, ఆకాంక్షలను జాతీయ స్థాయిలో వినిపించే బాధ్యత వైఎస్సార్సీపీ ఎంపీలదే
- ఏపీలో రైతులు, యువత, మహిళలు, కార్మికులు, పేదలు, బడుగుబలహీన వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు



అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి

పార్లమెంట్ రాజ్యసభలో ప్రజా సమస్యలపై పోరాడాలని రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై మాట్లాడాలని రాష్ట్రానికి రావలసిన నిధులపై పోరాడాలని వైయస్సార్సీపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ ఎంపీలకు సూచించారు. వైఎస్సార్సీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి అధ్యక్షత వహించిన వైఎస్ జగన్ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో బలంగా లేవనెత్తాలని ఎంపీలకు దిశానిర్దేశం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సంబంధించిన ప్రతి ముఖ్యమైన సమస్యను పార్లమెంట్ ఉభయ సభల్లో సమర్థవంతంగా, ధైర్యంగా లేవనెత్తాలని వైఎస్సార్‌సీపీ ఎంపీలకు వైఎస్ జగన్ సూచించారు. రాష్ట్ర ప్రజల కష్టాలు, సమస్యలు, ఆకాంక్షలను జాతీయ స్థాయిలో వినిపించే బాధ్యత వైఎస్సార్సీపీ ఎంపీలదేనని ఆయన గుర్తు చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర

- మిగతా3లో





## అంతరిక్షం అంటే నక్షత్రాలు, గ్రహాలే కాదు

- దేశాల హద్దులు లేకుండా మనమంతా ఒకే గ్రహంపై ఉన్నామన్న భావన కలుగుతుంది
- ఢిల్లీ ఐఐటీలో ఏర్పాటు చేసిన 'ది మేకింగ్ ఆఫ్ యాన్ ఆస్ట్రోనట్' ప్రోగ్రామ్‌లో సునీతా విలియమ్స్ ప్రసంగం - స్పేస్ సైన్స్, తన అనుభవాన్ని పంచుకుని విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తూ
- "ప్రస్తుతం మానవ అంతరిక్ష పరిశోధనకు చాలా ప్రత్యేకమైన సమయం
- నిజ జీవితంలో ఉన్నట్లే ప్రతి స్పేస్ మిషన్‌కూ ఎత్తుపల్లాలు ఉంటాయి
- కానీ ప్రతీ అనుభవం మనల్ని రాబోయే సవాళ్లను ఎదుర్కొనేందుకు మెరుగుపరుస్తుంది

## దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు ఖండించాలి

- పార్టీ నేతలకు కీలక సూచన చేసిన పవన్ కల్యాణ్
- ఇతర వ్యక్తుల మధ్య జరిగే వాటిని జనసేనకు ఆపాదించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న పవన్
- వివాహేతర సంబంధాలను కూడా జనసేనపై రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని వ్యాఖ్య
- ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ విధమైన నీచ రాజకీయాలు చేస్తున్నారు



అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి

జనసేన పార్టీపై ఎటువంటి దుష్టశక్తుల ప్రభావం పడకుండా జనసైనికులు, వీర మహిళలు, పార్టీ నాయకులు కాపు కాస్తున్నారని... పార్టీ పట్ల వారికున్న నిబద్ధత చాలా గొప్పదని ఏపీ డిప్యూటీ సీఎం ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీకి చెందిన కొందరు కీలక నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. సంస్థాగత అంశాలపై నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో వ్యక్తుల మధ్య జరిగే ఘర్షణలు, ఆర్థిక లావాదేవీలు, మానసిక బలహీనతలు, వ్యక్తిగత కుల విభేదాలను జనసేన పార్టీకి ఆపాదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కిరాయి వక్తలు, కిరాయి మాధ్యమాలు కలిసి పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేకంగా వివాహేతర సంబంధాలు వంటి వ్యక్తిగత అంశాలను కూడా

- మిగతా3లో

# టీడీపీలో సెకండ్ జనరేషన్



**విజయవాడ :** తెలుగుదేశం పార్టీ రాజకీయ ప్రయాణం ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఈ మార్చితో పార్టీకి 44 సంవత్సరాలు పూర్తై 45వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. పార్టీ ఆవిర్భావ సమయంలో యువకులుగా రాజకీయాల్లోకి వచ్చిన చాలా మంది నేతలు ఇప్పుడు వయోభారంతో సీనియర్ స్థాయికి చేరుకున్నారు. అప్పట్లో అన్న ఎన్టీఆర్ చేతుల మీదుగా తొలి టికెట్ తీసుకుని అసెంబ్లీలో అడుగుపెట్టిన యువ నాయకులే, నేడు పార్టీలో అత్యంత అనుభవజ్ఞులుగా గుర్తింపు పొందుతున్నారు. కాలం మారినట్లే, రాజకీయాల్లోనూ మార్పు అవసరమన్న ఆలోచనలు ఇప్పుడు ఆ సీనియర్లలో మొదలయ్యాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ఆంధ్రప్రదేశ్ అంతటా చూస్తే, టీడీపీలోని సీనియర్ నేతల నుంచి ఒకే రకమైన మాట వినిపిస్తోంది. తాము ఇక రాజకీయాల నుంచి తప్పుకోవాలని, యువతకు అవకాశం ఇవ్వాలని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు. ఇది ఒకరిద్దరి అభిప్రాయం మాత్రమే కాకుండా, చాలా జిల్లాల్లో వినిపిస్తున్న స్వరం కావడం విశేషం. ఈ జాబితా ఎంత పెద్దదంటే, ఒక ప్రాంతీయ పార్టీలో ఇంతమంది నేతలు ఒకేసారి పక్కకు తప్పుకునే పరిస్థితి దేశ రాజకీయాల్లో అరుదేనని చర్చ సాగుతోంది.సాధారణంగా రాజకీయాల్లో వయస్సుతో సంబంధం లేదని, చివరి శ్వాస వరకూ కొనసాగుతామని చెప్పే నాయకులు ఎక్కువ. కానీ టీడీపీ సీనియర్లు మాత్రం భిన్నంగా ఆలోచిస్తున్నారని అంటున్నారు. దీనికి ప్రధాన కారణంగా రాబోయే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న పార్టీ వ్యూహం ఉందన్న ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా నారా లోకేష్ నాయకత్వం మరింత బలపడుతూ, ఆయన చుట్టూ కొత్త తరం నాయకుల బృందం తయారవుతుందని భావిస్తున్నారు. ఈ మార్పును దృష్టిలో పెట్టుకుని, ముందుగానే తాము తప్పుకుంటే మంచిదన్న ఆలోచన సీనియర్లలో ఏర్పడినట్టు చెబుతున్నారు.ఇదే సమయంలో మరో వ్యూహాత్మక ఆలోచన కూడా ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గతంలో చంద్రబాబు నాయుడు వద్ద తాము కీలక పాత్ర పోషించినట్లే, ఇప్పుడు తమ వారసులను లోకేష్ టీంలోకి చేర్చితే భవిష్యత్తులో కుటుంబ రాజకీయాలకు భరోసా ఉంటుందన్న భావన కూడా ఈ నిర్ణయాల వెనుక ఉందని అంటున్నారు. “దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి” అన్న సామెత రాజకీయాల్లో ఉన్నవారికి మరింత వర్తిస్తుందన్న మాట వినిపిస్తోంది.ఇటీవల నర్సీపట్నం లో జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనకు 70 ఏళ్లు వచ్చాయని, ఇక రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని వేదికపైనే ప్రకటించడం పెద్ద చర్చకు దారితీసింది. ఆయన కుమారుడు విజయ్ పాత్రుడుకు వచ్చే ఎన్నికల్లో అవకాశం కల్పించాలన్న ప్రయత్నం జరుగుతోందన్న ప్రచారం కూడా ఉంది. అదే విధంగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా వయోపరంగా అదే దశకు చేరుకుంటుండటంతో, ఆయన కుటుంబ వారసత్వంపై దృష్టి పెట్టారని అంటున్నారు.ఈ జాబితాలో బండారు సత్యనారాయణమూర్తి , కిమిడి కళా వెంకటరావు , దాడి వీరభద్రరావు వంటి పలువురు ప్రముఖులు ఉన్నారు. ఒక అంచనాగా చూస్తే 2029 ఎన్నికల నాటికి కనీసం ముప్పయి నుంచి నలభై మంది సీనియర్ నేతలు రాజకీయాల నుంచి తప్పుకునే అవకాశం ఉందన్న మాట వినిపిస్తోంది. అదే సంఖ్యలో కొత్త తరం నాయకులు రంగప్రవేశం చేసే అవకాశమూ ఉందని అంటున్నారు. ఈ మార్పులను టీడీపీ హైకమాండ్ ఎలా సమతుల్యం చేస్తుంది, అనుభవం?యువత మధ్య సమన్వయాన్ని ఎలా సాధిస్తుంది అన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.

## క్రమశిక్షణను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలి

- : ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్

- : నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్, ట్రైనీ ఐపీఎస్ అశ్వీన్ మనిదీప్, డిటిసి వీర్రాజు, తదితరులు..






**అంకుశం న్యూస్ అనంతపురం, జనవరి 22 :** రహదారి భద్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. గురువారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన ర్యాలీని ఇంచార్జి జిల్లా కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణుచరణ్, ట్రైనీ ఐపీఎస్ అశ్వీన్ మనిదీప్, డిటిసి వీర్రాజు, ఆర్టీఓ కేశవనాయుడు, తదితరులు పాల్గొన్నారు.లిఈ సందర్భంగా ఇంచార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు మరియు క్రమశిక్షణను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాలో 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గత 21 రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 96 అవగాహన సదస్సులు నిర్వహించారని, ఇందులో సుమారు 5,000 మంది విద్యార్థులు, 2,000 మందికి పైగా డ్రైవర్లు, వాహనదారులు మరియు ప్రజలు పాల్గొన్నారన్నారు.ఈ సందర్భంగా డిటిసి వీర్రాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం సుమారు 360 మంది రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, మరణిస్తున్న వారిలో ఎక్కువ మంది 18 నుండి 25 ఏళ్లలోపు యువత ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు.

- ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్ నాయుడు, డిఎస్పీ మహబూబ్ భాష, ట్రాఫిక్ సిఐ వెంకటేష్ నాయక్, రవాణా శాఖ అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధికిబలమైన పునాదులు వేస్తున్న మంత్రి నారా లోకేష్

### - జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపి కేశినేని శివనాథ్



**అంకుశం ప్రతినిధి విజయవాడ జనవరి 22:** యువ నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తూ, ప్రజాసేవను ధ్యేయంగా చేసుకుని ముందుకు సాగుతున్న మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగుతున్న నాయకత్వం నారా లోకేష్‌దని ఎంపీ కేశినేని శివనాథ్ కొనియాడారు. పరిపాలనలో ఆధునిక దృక్పథం, యువత ఆశయాలకు అనుగుణమైన ఆలోచన విధానం, ప్రజలకు చేరువయ్యే రాజకీయ శైలి ఆయనను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని పేర్కొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ జూనియర్ కళాశాలను తీర్చిదిద్దటంలో విద్య,ఐటిశాఖ మంత్రి నారా లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారు. విద్యా శాఖ మంత్రిగా నారాలోకేష్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు విద్యా వ్యవస్థ లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. .రాష్ట్ర ప్రగతికి రథసారథిగా అభివృద్ధిని పరుగులు పెట్టించడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు.

రాజకీయ నీతిజ్ఞుడు, అపర చాణుక్యుడు. సీఎం చంద్రబాబు నాయుడు తనయుడిగా కాకుండా తనదైన శైలిలో దూసుకువెళుతున్నారంటూ కొనియాడారు. గెలుపు సాధించే విషయంలో ఎంతో పట్టుదలగా కృషి చేసి అందుకోవటం ద్వారా యువతకు స్ఫూర్తిగా నిలిచారన్నారుయువతను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దే దిశగా ఆయన చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమని, భవిష్యత్తు ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాదులు వేస్తున్న నాయకుడిగా నారా లోకేష్ ఎదుగుతున్నారని తెలిపారు.

ఈ సందర్భంగా నారా లోకేష్‌కు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని, ప్రజాసేవలో మరిన్ని మైలురాళ్లు అధిగమించాలని, రాష్ట్రాభివృద్ధికి మరింత బలమైన నాయకత్వాన్ని అందించాలని కోరుకుంటూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఖ

# వైసీపీకి కొత్త అధ్యక్షుడు... ధర్మాన

**గుంటూరు :** చంద్రబాబు ఆలోచన జగన్ చేస్తున్నారా? పార్టీ అధినేతగా ఉంటూ రాష్ట్ర పగ్గాలు మరొకరికి అప్పగించను న్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. 2014 వరకు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా ఉండేవారు చంద్రబాబు. కానీ తర్వాత జాతీయ అధ్యక్షుడిగా మారి రాష్ట్ర పార్టీ బాధ్యతలను వేరొకరికి అప్పగించారు. ఇప్పుడు జగన్ సైతం వైసీపీ రాష్ట్ర పగ్గాలు సీనియర్ నేతకు అప్పగించాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం జగన్మోహన్ రెడ్డి సోలో అన్నట్టు పరిస్థితి మారింది. ఆపై ఆయన చుట్టూ ఆ నలుగురు చేరారని.. వారి వల్లే పార్టీ ఓడిపోయిందన్న విమర్శ ఉంది. అందుకే ఈసారి రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలను సీనియర్ నేతకు అప్పగించేందుకు జగన్మోహన్ రెడ్డి కీలక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తద్వారా పార్టీలో సీనియర్లకు సైతం గౌరవం కల్పించినట్లు అవుతుంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ అధ్యక్షుడిగా జగన్మోహన్ రెడ్డి కొనసాగుతూ వచ్చారు. గౌరవ అధ్యక్షురాలిగా విజయమ్మ ఉండేవారు. కానీ షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడంతో ఆమెకు అండగా నిలిచేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షురాలి పదవి నుంచి తప్పుకున్నారు విజయమ్మ. అప్పటినుంచి పార్టీని అంతా తానై నడిపిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. అయితే గతంలో విజయసాయిరెడ్డి కొద్దిరోజులపాటు జగన్ తర్వాత అన్నట్టు పరిస్థితి ఉండేది. అటు తరువాత సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ బాధ్యతలను చూస్తున్నారు. అయితే జగన్ చుట్టూ ఉన్న వారితో పని జరగదని.. పార్టీ అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నందున రాష్ట్ర అధ్యక్ష పదవి అనేది క్రియేట్ చేయాలన్న ఆలోచన వచ్చినట్లు సమాచారం. పార్టీ అధినేతగా జగన్మోహన్ రెడ్డి ఉంటే.. రాష్ట్ర పార్టీ బాధ్యతలను వేరే నేతకు అప్పగిస్తే బాగుంటుందన్న అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి వినిపించిందట. అందుకే పార్టీలో ఒక సీనియర్ నేతకు అధ్యక్ష బాధ్యతలు కానీ.. పార్టీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్గా కానీ అవకాశం ఇస్తారని తెలుస్తోంది.ఉమ్మడి రాష్ట్రంలోనే సీనియర్ నేతగా ఉన్నారు ధర్మాన ప్రసాదరావు. 1989లో తొలిసారిగా ఆయన పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. మంత్రి కూడా అయ్యారు. రాజశేఖర్ రెడ్డి కి అత్యంత ఆప్తుడిగా మెదిలారు. ౦౦

## పార్లమెంట్ ప్రజా సమస్యలపై పోరాడండి

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయంలో వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి వైఎస్సార్‌సీపీ ఎంపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ ఏపీలో రైతులు, యువత, మహిళలు, కార్మికులు, పేదలు, బడుగుబలహీన వర్గాల ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్న వైఎస్ జగన్డ ఈ వర్గాలపై కూటమి ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం, అన్యాయాన్ని పార్లమెంట్ వేదికగా ఎండగట్టాలని ఎంపీలకు సూచించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో అమలైన అనేక సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేయడం, ప్రజల హక్కులను కాలరాస్తున్న తీరును కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీలకు చెప్పారు. దీంతోపాటు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని, అప్పులు చేయడంలో యధేచ్ఛగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, దీంతో రాష్ట్రం భయంకరమైన రుణభారంలో కూరుకుపోతుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారిందని వైఎస్ జగన్ అన్నారు. టీడీపీ అమలు చేస్తున్న “రెడ్ బుక్ పాలన” కారణంగా రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపు పెరిగిపోయిందని, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులపై దాడులు, అక్రమ కేసులు, వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు కూటమి నాయకులు కాలరాస్తున్నారని వైయస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వైఎస్సార్సీపీకి చెందిన దళిత కార్యకర్త మందా సల్మాన్‌పై జరిగిన దాడి, హత్య ఘటనను ప్రస్తావించిన వైఎస్ జగన్డ రాష్ట్రంలో దళితులపై దాడులు, అక్రమ కేసులు, వేధింపులు రోజురోజుకీ పెరుగుతున్నాయని, ప్రభుత్వం చోద్యం చూస్తుందని వైయస్ జగన్ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో దళితులపై జరుగుతున్న అఘాయిత్యాలపై ఎంపీలు జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్‌ను కలసి సమగ్ర నివేదికతో కూడిన వినతిపత్రం అందజేయాలని వైఎస్ జగన్ సూచించారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, హత్యలు, వేధింపులపై రాజ్యాంగబద్ధ సంస్థలు తక్షణమే స్పందించి జోక్యం చేసుకోవాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపవద్దని ఎంపీలకు వైయస్ జగన్ స్పష్టం చేశారు. పార్లమెంట్‌ను ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఒక శక్తివంతమైన వేదికగా ఉపయోగించాలని, కేంద్రంపై నిరంతర ఒత్తిడి తీసుకువచ్చే విధంగా ఎంపీలు పనిచేయాలని వైఎస్ జగన్ సూచించారు. వైఎస్సార్సీపీ ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తుందని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## రాజకీయాల్లోకి విజయసాయిరెడ్డి రీఎంట్రీ.!

-మొదటిపేజీ తరువాయి

చేసిందని, భవిష్యత్‌లో మరోసారి తనను పిలిచే అవకాశం కూడా ఉందని చెప్పారు. వైసీపీ పార్టీ అంతర్గత వ్యవహారాలపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీలో నెంబర్-2 స్థానం అనేది ఉండదని, పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డే ఒకటి నుంచి వంద వరకు అన్నీ అన్నట్టుగా వ్యవహరిస్తారని చెప్పారు. పార్టీ లోపల తాను ఎదుర్కొన్న అవమానాలను తట్టుకోలేకే వైసీపీని వీడినట్లు వెల్లడించారు. తనపై వందల కోట్ల రూపాయలు దోచుకున్నానని ఆరోపణలు చేస్తున్నారని, అయితే తన ఆస్తుల వివరాలన్నింటినీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అలాగే, అరబిందో సంస్థలకు సంబంధించిన వ్యాపారాలు తనవి కాదని, ఇంకా ఎలాంటి అనుమానాలున్నా దర్యాప్తు చేసుకోవచ్చని సవాల్ విసిరారు.

రాజకీయాల్లోకి రీఎంట్రీ..

రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకున్నానన్న ప్రచారాన్ని విజయసాయిరెడ్డి ఖండించారు. తాను రాజకీయ సన్యాసం తీసుకోలేదని, వచ్చే జూన్ 25 తర్వాత మళ్లీ రాజకీయాల్లోకి రీఎంట్రీ ఇస్తానని తెలిపారు. రాజకీయంగా తన భవిష్యత్ ప్రణాళికలను అప్పటివరకు వెల్లడించబోనని కూడా ఆయన పేర్కొన్నారు.

## దుష్ప్రచాలను పార్టీ శ్రేణులు ఖండించాలి

-మొదటిపేజీ తరువాయి

జనసేనపై రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని పవన్ పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ విధమైన నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి దుష్ప్రచారాలను పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించాలని సూచించారు.

## 2035 నాటికి ఏపీ ‘డే-జీరో రెడీ స్టేట్’



-మొదటిపేజీ తరువాయి

ఇస్తోంది. దీనికోసం రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ప్రతినెలా సమావేశమై ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడంతో పాటు, అంతర్గత సమస్యలను పరిష్కరిస్తోంది. భూమి, యుటిలిటీస్, పర్యావరణ అనుమతుల వంటి అంశాల్లో వరుస అనుమతులకు బదులుగా ప్యారలల్ ప్రాసెసింగ్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ప్రాజెక్టులు ప్రారంభించే సమయాన్ని గణనీయంగా తగ్గించాం“ అని వివరించారు.

### ‘డే-జీరో రెడీ స్టేట్‘ అంటే...!

2035 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ‘డే-జీరో రెడీ స్టేట్‘గా గుర్తింపు పొందేలా చేయడమే తమ లక్ష్యమని లోకేశ్ పునరుద్ఘాటించారు. అంటే, పెట్టుబడి నిర్ణయం తీసుకున్న కొన్ని వారాల్లోనే క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో నిర్ణయాలు వ్యక్తుల ఇష్టానుసారం కాకుండా, పటిష్టమైన వ్యవస్థ ఆధారంగా జరుగుతాయని హామీ ఇచ్చారు. రియల్ టైం డేటాతో పనిచేసే యూనిఫైడ్ డిజిటల్ గవర్నెన్స్ ద్వారా జాప్యాన్ని ముందుగానే గుర్తించి, అవరోధాలను తొలగిస్తున్నామని వివరించారు.

### నిబంధనల సరళీకరణ

పరిపాలనలో వేగాన్ని పెంచేందుకు డీ-రెగ్యులేషన్ డ్రైవ్‌లో భాగంగా గత 18 నెలల్లో 50కి పైగా సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా నాలా చట్టాన్ని రద్దు చేశామని, డీ-క్రిమినలైజేషన్ దిశగా మరిన్ని చర్యలు తీసుకోనున్నామని వెల్లడించారు. తాము రిస్క్ బేస్డ్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌ను అనుసరిస్తున్నామని, తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇస్తూ, అధిక ప్రభావం చూపే ప్రాజెక్టుల విషయంలో లోతైన పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఇది సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

### ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని కొన్ని నగరాలకే పరిమితం చేయకుండా, అన్ని ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఇందులో భాగంగా 175 నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ ఆధారిత వృద్ధి ద్వారా ఉద్యోగాలు, ఆదాయం, సంపద సమానంగా పంపిణీ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి పార్కును స్థానిక వనరుల ఆధారంగా, అగ్రో-ప్రాసెసింగ్, సముద్ర ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల కోసం ప్రత్యేక క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఇది వలసలను తగ్గించడంతో పాటు, పెద్ద పరిశ్రమలకు సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు, నాణ్యమైన మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడమే ఏపీ ప్రత్యేకత అని లోకేశ్ అన్నారు. విధానాల స్థిరత్వం, సంస్థల విశ్వసనీయతతో పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. నమ్మకం, వేగం రెండూ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పోటీ వాతావరణంలో ఒక ప్రత్యేక పెట్టుబడి గమ్యస్థానంగా నిలబెడుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కెర్నీ సీనియర్ పార్టనర్ సుకేతు గాంధీ, గూగుల్ ఏసియా-పసిఫిక్ ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా, కాగ్నిజెంట్ గ్లోబల్ సీఎఫ్ఓ జతిన్ దలాల్, రెన్యూ ఛైర్మన్ సుమంత్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

# కొండపల్లి విజయవాడ రైల్వే ట్రాక్ సమస్య లను పరిష్కరించండి

- దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసి విజ్ఞప్తి చేసిన విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్
- ఉపగ్రహ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ వినతి..





**అంకుశం ప్రతినిధి విజయవాడ జనవరి 22:** కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి విజయవాడలోని కృష్ణ మిల్క్ యూనియన్ వరకు రైల్వే ట్రాక్ వెంబడి మురుగునీరు, వర్షపు నీరు పేరుకుపోయే సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్, బిజెపి మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి నూతలపాటి బాల కోటేశ్వరరావు , ఇతర నాయకులు అధికారులతో రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవను కలిసి వినతి పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ కొండపల్లివిజయవాడ మధ్య కీలకమైన రైల్వే కారిడార్ వెంబడి శాస్త్రీయ డ్రైనేజీ వ్యవస్థ, క్రాస్ డ్రైనేజీ నిర్మాణాలు, ఛానెల్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల వర్షాకాలంలోనే కాకుండా స్వల్ప వర్షపాతం సమయంలో కూడా నీరు నిలిచిపోతుందని తెలిపారు. దీని కారణంగా కొన్ని ప్రాంతాల్లో గట్టు కోతకు గురవడం, ట్రాక్ బలహీనపడటం, భద్రతా కారణాలతో రైళ్ల వేగం తగ్గించడం వల్ల కార్యాచరణ జాప్యాలు జరుగుతున్నాయని వివరించారు. అంతేకాకుండా ట్రాక్‌కు సమీపంలోని నివాసితులు, పరిశ్రమలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాయని పేర్కొన్నారు. కొండపల్లి పారిశ్రామిక ప్రాంతం నుంచి సరుకు రవాణా అధికంగా ఉండటం, ఈ లైన్ వ్యూహాత్మకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని, సమగ్ర నీటి నిర్వహణ వ్యవస్థను ప్రాధాన్యతపై చేపట్టాలని ఎంపీ కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి మొత్తం విస్తరణపై సాంకేతిక అంచనా నిర్వహించి, డ్రైనేజీ ఛానెల్‌లు, కల్వర్టులు, లింక్డ్ అవుట్‌ఫ్లో వ్యవస్థలతో కూడిన నెట్‌వర్క్‌ను రూపొందించి అమలు చేయాలని కోరారు. అవసరమైతే స్థానిక మున్సిపల్, నీటిపారుదల శాఖలతో సమన్వయం చేసుకుని తగిన బడ్జెట్ కేటాయింపులు చేయాలని సూచించారు.

అలాగే విజయవాడ రైల్వే స్టేషన్‌పై పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ ప్రస్తావించారు. బల్బ్ లైన్ల సమీప ప్రాంతాల్లో విస్తారమైన ఓపెన్ ల్యాండ్ అందుబాటులో ఉండటం, ప్రధాన రహదారులు, ఎయిర్‌వేస్‌లకు అనుసంధానం ఉండటం, భవిష్యత్తులో అమరావతి కొత్త రైల్వే లైన్‌కు దగ్గరగా ఉండటం వంటి అంశాలను వివరించారు. ఈ ప్రాంతంలో హాల్ట్ లేదా ఉపగ్రహ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తే అమరావతి, ఔటర్ రింగ్ రోడ్ల వంటి మౌలిక సదుపాయాలకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుందని, అలాగే విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌పై ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని తెలిపారు. ఈ ప్రతిపాదనలపై డీపీఆర్‌తో పాటు సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధం చేసి, సంబంధిత విభాగాలతో సంయుక్త తనిఖీ చేపట్టి, ప్రజా సౌలభ్యం, లాజిస్టిక్స్ రవాణాను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరగా జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సి.ఎ.వో. ఆర్.ఎస్.పి సందీప్ కుమార్ జైన్, డి.జి.ఎమ్ ఉదయనాథ్ కోట్ల, సెక్రటరీ జి.ఎమ్. మల్లాది శ్రీనివాసరావు, వడ్లమూడి జగన్ మోహన్ రావు, జాలిపర్తి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# నెరవేరిన గ్రామస్తుల కల శభాష్ పరిటాల సునీత








- ఏళ్ల కల ఈ రోడ్డు నిర్మాణం.. దాన్ని పూర్తి చేశాం
- ఇచ్చిన మాట నెరవేర్చామన్న ఎమ్మెల్యే పరిటాల సునీత
- కె.జి.కుంట-పి.ఆర్.కొట్టాల-ఎగువపల్లి రోడ్డు నిర్మాణ పనుల్ని పరిశీలించిన సునీత

**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 22:** రాప్తాడు నియోజకవర్గంలోనిరామగిరి మండలం కె.జి.కుంట - పి.ఆర్.కొట్టాల - ఎగువపల్లి రోడ్డు నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని.. దాని నిర్మాణం పూర్తి చేశామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. కొత్తగాదిగకుంట గ్రామం నుంచి వయా పి.ఆర్ కొట్టాల గ్రామం మీదుగా కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని ఎగువపల్లి గ్రామం వరకు 3కోట్ల నాబార్డ్-29 నిధులతో నిర్మించిన 6.4 కిలోమీటర్ల బీ.టీ రోడ్ ను మరియు కొత్తగాదిగకుంట - పి.ఆర్.కొట్టాల రోడ్డు నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మీదుగా పి.ఆర్ కొట్టాల - ఎగువపల్లి రోడ్డు వరకు 50లక్షల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన 850మీటర్ల సిసి రోడ్లను ఆమె స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి రోడ్డు పనుల గురించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గతంలో అనంతపురం నుంచి పేరూరు, పావగడ వెళ్లే బస్సు సర్వీసులు కొత్తగాదిగకుంట, పి.ఆర్.కొట్టాల మీదుగా ఎగువపల్లికి వెళ్లి అక్కడి నుంచి పేరూరు, పావగడకు వెళ్లేవన్నారు. అయితే పి.ఆర్.కొట్టాల రోడ్డు సౌకర్యవంతంగా లేకపోవడంతో బస్సు సర్వీసులు ఈ మార్గంలో కాకుండా కొత్తగాదిగకుంట నుంచి డైరెక్ట్ గా ఎగువపల్లికి వెళ్లేవన్నారు. దీని వలన పిఆర్ కొట్టాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అందుకే గత టీడీపీ ప్రభుత్వంలోనే ఈ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అప్పట్లో మట్టి రోడ్డు కూడా వేశామన్నారు. కానీ వైసీపీ నాయకులు అధికారంలోకి రాకముందు ఈ రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ గత ఐదేళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం వలన గ్రామస్థులు ఇబ్బంది పడ్డారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం రాగానే గత ఏడాది జనవరి 31న ఈ రోడ్డు పనులకు భూమి పూజ చేశామన్నారు. ప్రస్తుతం ఈ పనులు పూర్తి అయ్యాయని.. ఏళ్ల కల ఇప్పుడు సాకారమయిందని ఆమె అన్నారు. పిఆర్ కొట్టాల ప్రజలకు ప్రయాణానికి ఇక ఎలాంటి ఇబ్బంది ఉండదని ఎమ్మెల్యే సునీత అన్నారు..

# 24 గంటల్లో హత్య కేసు ఛేదించిన రాయదుర్గం పోలీసులు

## - భార్యను హతమార్చిన భర్త అరెస్ట్



**అంకుశం న్యూస్ రాయదుర్గం జనవరి 22:** రాయదుర్గం పట్టణంలో జరిగిన హత్య కేసును పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. భార్యను హత్య చేసి పరారైన భర్తను 24 గంటల్లోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. రాయదుర్గం పట్టణంలోని ముత్తరాసి కాలనీలో నివసిస్తున్న అలువ కుళ్లాయమ్మ (45) తన భర్త అలువ మారెన్న తరచూ అనుమానాలు పెంచుకొని గొడవలు పడుతున్న నేపథ్యంలో, కుమారుడితో కలిసి రాయదుర్గం పట్టణంలోని తన పుట్టినింటికి వచ్చి నివసిస్తోంది. ఈ క్రమంలో 20-01-2026 ఉదయం అలువ మారెన్న రాయదుర్గం చేరుకుని, పెద్దల సమక్షంలో కాపురం సర్దుబాటు చేసుకునే విషయమై చర్చ జరిగింది. అదే రోజు రాత్రి భోజనం అనంతరం, భార్యాభర్తలు పక్కనే ఉన్న రేకుల షెడ్డులో నిద్రపోయినట్లు నిందితుడు నమ్మించాడు. 21-01-2026 తెల్లవారుజామున సుమారు 3.15 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్రమ సంబంధం అనుమానంతో భార్యను దూషించిన నిందితుడు తీవ్ర ఆగ్రహానికి లోనై, ముత్తరాసి కాలనీలోని యానాది ఆంజనేయులు ఇంటిలో ఉన్న కొడవలిని తీసుకొని వచ్చి కుళ్లాయమ్మ తల, ముఖ భాగాలపై బలంగా నరికాడు. దీంతో ఆమె తీవ్ర రక్తగాయాలతో సంఘటనా స్థలంలోనే కుప్పకూలింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, గాయపడిన కుళ్లాయమ్మను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ 21-01-2026 ఉదయం ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదు చేశారు. కేసును సీరియస్‌గా తీసుకున్న రాయదుర్గం పట్టణ ఇన్స్పెక్టర్ జె. జయ నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ జి. ప్రసాద్ తమ సిబ్బందితో కలిసి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో భాగంగా రాయదుర్గంబి.ఎన్.హళ్లి రోడ్ సమీపంలోని శ్రీ ముద్దనేశ్వర స్వామి ఆలయ ఆర్చ్ వద్ద నిందితుడు అలువ మారెన్నను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గౌరవ న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## హెచ్.ఐ.వితో జీవిస్తున్న వారిని ప్రేమతో ఆదరించండి




**రాప్తాడు, అంకుశం న్యూస్ జనవరి 22:** హెచ్.ఐ.వితో జీవిస్తున్న వారిపై వివక్ష చూపకుండా ప్రేమతో ఆదరించాలని స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరామ్ శ్రీనివాస్ అన్నారు. రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, దిశ వారి ఆదేశాల మేరకు, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఎల్. హెచ్.ఐవి నెట్వర్క్ కోఆర్డినేషన్, ఫెసిలిటేషన్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా లోకల్ డోనార్స్ సహకారంతో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి డాక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ హెచ్. ఐ.వి బాధితులు విధిగా మందులు మింగడంతో పాటు తగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవచ్చున్నారు. లింక్ వర్కర్ ప్రోగ్రాం గురించి వారు అందిస్తున్న సేవల గురించి తెలియజేశారు. నెట్ వర్క్ పి..డి. రామాంజనేయులు మాట్లాడుతూ హెచ్.ఐ.వి తో జీవిస్తున్న వారికి పౌష్టికాహారం అందించడం అభిందనీయమని తెలియజేశారు. వివిధ డోనర్స్ సహాయంతో సేకరించిన పౌష్టికాహారాన్ని 30 మందికి హెచ్.ఐ.వి తో జీవిస్తున్న వారికి పంపిణీ చేశారు. ఆలంబన రక్తదాతల ప్రతినిధి జనార్ధన్ గారి సహకారం తో 60 మందికి బోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా జిల్లా రిసోర్స్ పర్సన్ రమేష్ యాదవ్, ఫార్మసిస్ట్ మూర్తి, ఎం.పి.హెచ్.ఎ నారాయణస్వామి, ఎం.అండ్.ఇ హస్సేన్ వలి, జోనల్ సూపర్వైజర్ శ్రీరాములు, లింక్ వర్కర్స్ స్వప్న, నాగరాజ్, నాగేంద్ర, మారుతి, విజయ్, భారతి, లక్ష్మీనారాయణమ్మ, దివ్యభారతి, రాజేశ్వరి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ సేవలందించడంలోనే నిజమైన ఆనందం ఉంది -పరిజ్ఞేయానందజీ మహారాజ్





**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జనవరి 22:** భారతదేశాన్ని ప్రేమించమని వివేకానంద ఇచ్చిన పిలుపు యువత ఆదర్శంగా తీసుకోవాలని,సమాజానికి నిస్వార్థ సేవలు అందించడం ద్వారానే నిజమైన ఆనందం కలుగుతుందని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ అన్నారు.గురువారం అనపర్తి శ్రీ రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా అనపర్తి వివేకానంద సెంటర్ లో పలువురు ప్రముఖులు ఆయన విగ్రహానికి పుష్పాలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం అనపర్తి మండలం దుప్పలపూడి ఆర్ వి ఆర్ కన్వెన్షన్ లో సమితి అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన జయంతి సభలో ముఖ్య అతిథి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచానికి జ్ఞాన సంపాదన అందించే ఏకైక దేశం భారతదేశమని యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకుని వికసిత్ భారత్ లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మిమ్మల్ని సత్కరించడం అంటే వివేకానందనందుని సత్కరించినట్టు భావిస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం ముఖ్య అతిథి అప్పాల ప్రసాద్ ను సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.అనంతరం స్వామి వివేకానంద జీవన సాఫల్య 2026 పురస్కార గ్రహీతలు హరియాణ పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయ వ్యవస్థాపకులు ఎస్ ఎల్ కనకరాజ్ గురు స్వామి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ శాఖ చైర్మన్ వైడి రామారావు, స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ మహారాజ్( శాక్తేయ సంప్రదాయకులు, శ్రీశ్రీశ్రీ అంబాత్రేయ క్షేత్ర వ్యవస్థాపకులు, బిజ్వార్)కు రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ చేతులు మీదుగా పురస్కారాలు అందజేశారు.పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.25 వేలు నగదు, జ్ఞాపిక ప్రశంసా పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, ప్రముఖ పారిశ్రామికవేత్తలు తేతల ఉపేంద్ర రెడ్డి,మేడపాటి రామలింగారెడ్డి, సత్తి లక్ష్మణ రెడ్డి, సమితి కార్యవర్గానికి చెందిన సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందర రామారెడ్డి,ఎం దుర్గాప్రసాద్, తాడి చంద్రశేఖర్ రెడ్డి,లెఫ్ట్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్షర ప్రవీణ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న రవికుమార్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జనవరి 22:** ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియం, విజయవాడ నందు జరిగిన, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక శ్రీ శ్రీ కళా వేదిక 162 వ జాతీయ సదస్సులో ప్రముఖ కవి, రచయిత శ్రీ కొత్తపల్లి రవికుమార్ కి అక్షర ప్రవీణ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న సందర్భంగా రవి కుమార్, స్థానిక అనపర్తి జిబిఆర్ కళాశాలలో సీనియర్ మ్యాథమాటిక్స్ ఐఐటి లెక్చరర్ గా పనిచేస్తున్నారు. రవికుమార్ ని జి బి ఆర్ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), డైరెక్టర్లు బి రత్నారెడ్డి, జి జగన్నాథరెడ్డి, డివిఆర్ఏ పాపిరెడ్డి, కె. హరినాద్ రెడ్డి,ఎస్ వి వి సత్యనారాయణ రెడ్డి, ఎం. ఉమా వెంకటరెడ్డి, జూనియర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి ఆర్ ఎల్ స్వామి డాక్టర్ ఎన్ పి అబ్బాయి రెడ్డి, అధ్యాపక అధ్యాపకేతర బృందం అభినందించారు.

## కార్యకర్తే అధినేత అన్న లోకేష్ వ్యాఖ్యలు ధైర్యాన్నిచ్చాయి

- మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ రవీంద్రారెడ్డి



**.పోరుమామిళ్ల,జనవరి 22(అంకుశం పత్రిక):** అధికారం వచ్చిన వెంటనే ఒక ప్రణాళిక రూపొందించుకొని ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతూ ముందుకు పోతున్న యువగళం అధినాయకుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 43వ పుట్టినరోజు వేడుకలు పండుగ వాతావరణంలో నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని, గొప్పగా భావిస్తున్నామని బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి గురువారం విలేకరులతో అన్నారు. రాష్ట్ర విద్యా శాఖలో కూడా క్రొత్త ఒరవడిని సృష్టిస్తున్నారని, ఐటి శాఖ కూడా ఆయన ఆధీనంలో ఉండడం వల్ల విదేశాల్లో పర్యటించి పెట్టుబడులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినాయకుడు అని చాటి కార్యకర్తల్లో ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచాడన్నారు. మా యువనాయకుడు నారా లోకేష్ 43 వ జన్మదిన వేడుకలు పోరుమామిళ్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా వున్న స్థలంలో ఘనంగా నిర్వహించబోతున్నాం అన్నారు. ఉదయం 10-30 గంటలకు మాజీ ఎంఎల్ఏ విజయమ్మ, బద్వేల్ నియోజకవర్గం తెలువుదేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి వేదిక వద్దకు చేరుకొని కేక్ కటింగ్ చేసి జన్మదిన సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. పోరుమామిళ్ల, కాశినాయన, కలసపాడు మండలాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

## రథ సప్తమి ఏర్పాట్లను తనిఖీ చేసిన టీటీడీ చైర్మన్



అంకుశం న్యూస్ తిరుమల జనవరి 22: జనవరి 25వ తేదిన రథ సప్తమి సందర్భంగా వాహన సేవలను వీక్షించేందుకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం తిరుమల శ్రీవారి ఆలయ మాడ వీధుల్లోని గ్యాలరీల్లో చేస్తున్న ఏర్పాట్లను టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, శ్రీమతి పనబాక లక్ష్మి, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదాలు గ్యాలరీల్లోని ప్రతి భక్తుడికి చేరేలా ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయాలని చెప్పారు. పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి బయటకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్య నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంస్కృతాంధ్ర కళాశాలల పై కాస్తంత దృష్టి సారించండి

**- నిమ్మరాజు చలపతిరావు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షులు విజ్ఞప్తి**

**అంకుశం న్యూస్ గుంటూరు జనవరి 22:** ప్రభుత్వ విద్యాసంస్థలు...అలాగే సంక్షేమ వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు, ఆహార మెనూ పట్ల రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుండటం అభినందనీయం....తాజాగా పర్యవేక్షనకై 9 ప్రభుత్వ శాఖల అధికారులతో జాయింట్ కమిటీ ఏర్పాటు చేయటం జరిగింది. అయితే వేలాదిమంది భాషా పండితులను అందించిన ఓరియంటల్ కళాశాలల పట్ల కనీస శ్రద్ధ కనిపించటం లేదు. ఏపీ లో 60 కళాశాలలు ఉండగా ప్రస్తుతం ఐదు కలశాలు నడుస్తున్నాయి. ఒకటి తిరుపతి లో టీటీడీ ఆధ్వర్యంలో, రెండోది విజయనగరం లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.ఇక కోవూరు లో హాస్టల్ లేదు. జిల్లెళ్ళమూడి లో ఏడెకరాల భూమి ఫలసాయంతో నడుస్తుంటే 287 ఎకరాల మాగాణి భూమి ఫల సాయంతో నడిచే తిమ్మసముద్రం లోని శ్రీ గోరంట్ల వెంకన్న కళాశాల దయనీయ స్థితిలో నడుస్తున్నది. దేవాదాయ శాఖ అధికారుల జీత భత్యాలలో నామ మాత్రంగానైన ఖర్చులేదు. గత 50 ఏళ్లుగా కూడా కనీసం సరైన మరుగుదొడ్లు.....హాస్టల్ భవనం లేదు. గతంలో వరండాలోనే నిద్రించేవారు. ప్రస్తుతం 80 మంది విద్యార్థులు ఉంటే వీరిలో 70 మంది ఆడపిల్లలు కళాశాల వెలుపల కునరిల్లుతున్న భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నారు. సరైన హాజరు లేకనే రెండేళ్ల క్రితం భాషా ప్రవీణ (తెలుగు) కోర్సు రద్దయింది అసలు ఉన్నత విద్య శాఖ విద్యా మండలి






అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదో అర్థం కావడం లేదు. మెనూ....కనీస సౌకర్యాల పట్ల ఆకస్మిక తనిఖీలు ఎందుకు లేవు.....ఈ ఒక్క కళాశాల పట్ల కనీసం కోట్లాది రూపాయల ఆస్తుల పరిరక్షణ కోసమైనా శ్రద్ధ వహించాల్సి ఉంది. ఈ ఆస్తులతో అసలు సంస్కృత విశ్వవిద్యాలయం ఏర్పాటు చేరవచ్చు.

# రాప్తాడు నియోజకవర్గం లో ఉపాధి హామీ పనులు పూర్తి చేయండి

**- అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం**

**- వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఉపాధి హామీ పై రివ్యూ**

**- మస్టర్ ఆన్ లైన్ సమస్యను త్వరగా పరిష్కరించాలన్న ఎమ్మెల్యే**

**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 22:** ఫిబ్రవరి 15వ తేదిలోగా ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా తాజాగా మంజూరైన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆమె సమీక్ష నిర్వహించారు. రామగిరి



మండలం వెంకటాపురంలోని క్యాంప్ కార్యాలయంలో పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్, ఎంపీడీఓలు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మంజూరైన సి.సి రోడ్లు, బి.టి రోడ్ల పనులు ఎంత వరకు వచ్చాయన్నది ఆరా తీశారు. మస్టర్స్ ఆన్ లైన్ సమస్య ఉందని.. దాని వలన కొంత జాప్యం జరుగుతోందని చెప్పగా.. వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. కూలీలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ఫిబ్రవరి 15నాటికి కేటాయించిన పనులన్నీ పూర్తి చేయాలన్నారు. రికార్డుల్లో ఎక్కడా తప్పిదాలకు అవకాశం ఉండకూడదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉపాధిహామీ పనులు నియోజకవర్గంలో జరుగుతున్నాయన్నారు. ఓ వైపు కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు ఇంకో వైపు అభివృద్ధి కార్యక్రమాలు కూడా ముందుకు సాగుతున్నాయన్నారు.

# అహుడ అభివృద్ధికి చర్యలు

**- : ఇంఛార్జి జిల్లా కలెక్టర్ & వైస్ చైర్మన్ సి.విష్ణు చరణ్**

**- : నగరంలోని అహుడ కార్యాలయంలో అహుడపై అధికారులతో చైర్మన్ టి.సి.వరుణ్ తో కలిసి సమీక్ష నిర్వహించిన ఇంఛార్జి జిల్లా కలెక్టర్ & అహుడ వైస్ చైర్మన్ సి.విష్ణు చరణ్..**

**అంకుశం న్యూస్ అనంతపురం, జనవరి 22 :** అనంతపురము - హిందూపురము అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (అహుడా) అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఇంఛార్జి జిల్లా కలెక్టర్ & వైస్ చైర్మన్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. నగరంలోని అహుడ కార్యాలయంలో గురువారం అనంతపురము - హిందూపురము అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (అహుడా)పై సంబంధిత అధికారులతో అహుడ చైర్మన్ టి.సి.వరుణ్ తో కలిసి ఇంఛార్జి జిల్లా కలెక్టర్ & అహుడ వైస్ చైర్మన్ సి.విష్ణు చరణ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అహుడా గురించి పూర్తి వివరాలను అధికారులు ఇంఛార్జి జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఏ విభాగంలో ఎలాంటి పురోగతి ఉంది, ప్లానింగ్, ఎల్ఆర్ఎస్,




ఇతర అంశాల గురించి ఇంఛార్జి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఌఈ సందర్భంగా ఇంఛార్జి జిల్లా కలెక్టర్ & వైస్ చైర్మన్ మాట్లాడుతూ అహుడా అభివృద్ధి కోసం అన్ని విభాగాల అధికారులు కష్టపడి పని చేయాలని సూచించారు. అనంతరం అహుడా కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి అర్జీదారుల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఌఅంతకుముందు అహుడ



కార్యాలయంలోని తన ఛాంబర్ లో అహుడ వైస్ చైర్మన్ గా ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అహుడ చైర్మన్, అహుడ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి వైస్ చైర్మన్ కి శు భాకాంక్షలు తెలిపారు.ఌఈ కార్యక్రమంలో అహుడ డీఈ రేవంత్, ఈఓ అరుణ కుమారి, ఏఓ రవిచంద్రన్, కేఎండి.ఇషాక్, ఎగ్జిక్యూట్ ఇంజినీర్ దుష్యంత్, జీపీఓ హరీష్ చౌదరి, సర్వేయర్ శరత్, తదితరులు పాల్గొన్నారు.

## రబీలో సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ చేసుకోండి -ఏడీఏ అల్తాఫ్ ఖాన్




**రాప్తాడు, అంకుశం న్యూస్ జనవరి 22:** రబీలో రైతులు సాగు చేసిన వివిధ పంటలకు ఈ-క్రాప్ చేసుకోవడం వల్ల వివిధ ప్రభుత్వ పథకాలను లబ్ది పొందవచ్చని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అల్తాఫ్ ఖాన్ సూచించారు. మండలంలోని ఎం.బండమీద పల్లి గ్రామ పంట పొలాలను గురువారం ఆయన రైతులతో కలిసి సందర్శించి సలహాలు, సూచనలను ఇచ్చారు. మండలంలోని ప్రతి రైతు కూడా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ఏపీఏఐఎంఎస్ 2.0 అనే యాప్ ను తయారు చేసిందని ఇందులో వ్యవసాయానికి సంబంధించిన సమాచారం ఉంటుందని, రైతులు ఈ యాప్ ను వాడాలని సూచించారు. అనంతరం వేరుశనగ పంటను పరిశీలించి వేరుకుళ్ళు తెగులు సోకిందని, నివారణకు ఎం-45 ఒక లీటరు నీటికి 3 కలిపి డ్రెంచింగ్ చేసుకోవాలన్నారు. రసం పీల్చు పురుగుల నివారణకు ఒక లీటరు నీటికి రెండు ఎం.ఎల్ ఇమిడా క్లోరోప్రిడ్ కాన్ఫిడార్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎస్.కృష్ణ చైతన్య, ఏఈఓలు సుజిత, రంజిత, ఆర్.ఎస్ కె సిబ్బంది అనుప, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## హోంమంత్రి అనితను కలిసిన కానిస్టేబుల్ జయశాంతి.

**- జయశాంతి కుటుంబం యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్న మంత్రి.**

**- మంత్రిని కలవడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన జయశాంతి.**





**అంకుశం ప్రతినిధి విజయవాడ, జనవరి 22:-** కానిస్టేబుల్ జయశాంతి ఏపీ హోంమంత్రి వంగలపూడి అనితను గురువారం ఉదయం విజయవాడలో కలిశారు. ఆమెతో కలిసి మంత్రి అనిత అల్పాహారం చేశారు. రంగంపేటకు చెందిన జయశాంతి ఇటీవల విధి నిర్వహణలో లేకపోయినా బిడ్డను చంకనెత్తుకుని ట్రాఫిక్ ను చక్కదిద్దారు. విషయం తెలుసుకున్న మంత్రి అనిత రెండ్రోజుల క్రితం ఆమెకు ఫోన్ చేసి అభినందించారు. ఆ సంభాషణలో మంత్రిని కలవాలనుందని జయశాంతి కోరారు. ఈ నేపథ్యంలోనే కానిస్టేబుల్ ను పిలిపించుకొని వారితో కలిసి అనిత అల్పాహారం చేశారు. ఆమె కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జయశాంతి పిల్లలతో మంత్రి సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత కానిస్టేబుల్ జయశాంతి కుటుంబ సభ్యులను సత్కరించారు. మంత్రిని కలవడం పట్ల జయశాంతి ఆనందం వ్యక్తం చేశారు.

## జనవరి 23న శ్రీవారి ఆలయంలో వార్షిక విశేషపూజ

**అంకుశం న్యూస్ తిరుమల జనవరి 22:** వసంత పంచమి పర్వదినం సందర్భంగా శ్రీవారి ఆలయంలో జనవరి 23వ తేదిన వార్షిక విశేష పూజను వైభవంగా నిర్వహించనున్నారు. గతంలో శ్రీవారి ఆలయంలో ప్రతి సోమవారం వారపు సేవగా విశేషపూజను నిర్వహించేవారు. శ్రీవారి ఉత్సవమూర్తుల అరుగుదలను అరికట్టి భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఏడాదికోసారి మాత్రమే అభిషేకం నిర్వహించాలనే జీయంగార్లు, అర్చకులు, ఆగమ పండితుల సూచన మేరకు వసంతోత్సవం, సహస్ర కలశాభిశేకం, విషేశపూజను ఏడాదికోసారి నిర్వహించాలని టీటీడీ గతంలో నిర్ణయించింది. ఈ మేరకు టీటీడీ ప్రతి ఏడాది వసంత పంచమి పర్వదినాన వార్షిక విశేషపూజను సర్కార్ (ఏకాంతం)గా నిర్వహిస్తోంది.

## అనంతపురం నగరంలో తొలగించిన మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహంను ఏర్పాటు చేయండి

**- కమిషనర్ గారికి, డా. పోతుల నాగరాజు విజ్ఞప్తి.**



**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 22** :అనంతపురం నగరంలో తొలగించిన మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని డాక్టర్ పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే మొదటి సారి ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతి రావ్ పూలే విగ్రహం ను అనంతపురం నగర కార్పొరేషన్ పరిధిలో స్థానిక సంగమేష్ సర్కిల్ లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విగ్రహం రాష్టంలో పూలే ఆలోచనకు, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పూలే జయంతి, వర్ధంతి కార్యక్రమం జరపడం, ప్రతి జిల్లా కేంద్రంలో పూలే విగ్రహాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఒక మోడల్ గా ఈ విగ్రహం ఉపయోగపడింది. ఇది అనంతపురం జిల్లా లోని బహుజన ప్రజా సంఘాల,ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. గత ప్రభుత్వం హాయంలో రహదారి విస్తరణ లో భాగంగా అక్కడ ఉన్న విగ్రహం తొలగించడం జరిగింది. కానీ తిరిగి అక్కడ విగ్రహం ఏర్పాటు చేయడం లో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించి మహనీయుని విగ్రహం ఎక్కడ ఉంచిన విషయం కూడా తెలియదు. ఇలా గతం లో జరిగిన తప్పు ఇప్పుడు చేయకుండా అదే స్థానం లో పూలే విగ్రహం ఏర్పాటు చేసి, ఆ సర్కిల్ కు కూడా మహాత్మా జ్యోతి రావ్ పూలే సర్కిల్ గా నామకరణం చేయాలని ఈరోజు నగర కమిషనర్ గారికి రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డా. పోతుల నాగరాజు గారు విజ్ఞప్తి చేసారు. వెంటనే పనులను ప్రారంభం చేస్తాం అని అక్కడ విగ్రహం ఏర్పాటు చేసే బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్ చేపడుతుంది అని కమిషనర్ తెలిపారు.

## ఇద్దరు హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**- జిల్లా ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా రూ. 10,13,880/-ల చెక్కులు అందజేత**

**- వితరణగా ఒక్క రోజు వేతనాన్ని అందజేసిన ఉమ్మడి జిల్లా హోంగార్డులకు అభినందనలు తెలియజేసిన జిల్లా ఎస్పీ జగదీష్**






**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం జనవరి 22:** అనంతపురం జిల్లాలో ఇటీవల వేర్వేరుగా అనారోగ్యంతో మృతి చెందిన ఇద్దరు హోంగార్డులకు జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆర్థిక సాయం అందించారు. జిల్లాలో పని చేస్తున్న ఎం.పెద్దన్న (HG no 563), బాబా ఫకృద్ధీన్ (HG no 643) లు వేర్వేరుగా అనారోగ్య కారణాలతో చనిపోయారు. ఈ ఇద్దరి కుటుంబ సభ్యులకు చెరో 5,06,940/- ప్రకారం రూ.10,13,880/-ల చెక్కులు జిల్లా ఎస్పీ గారి చేతుల మీదుగా అందజేశారు. ఈ డబ్బును వృథా చేసుకోకుండా పిల్లల/కుటుంబ అభివృద్ధికి వినియోగించుకోవాలని ఎస్పీ జగదీష్ సూచించారు. ఉమ్మడి జిల్లా హోంగార్డులు తమ గౌరవ వేతనంలో ఒక రోజు వేతనాన్ని ఇలా మృతిచెందిన సహచర హోంగార్డు కుటుంబాలకు అందజేయడం అభినందనీయమని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ ఐ పవన్ కుమార్, ఆర్ ఎస్ ఐ జాఫర్, ఏ.ఆర్. ఆర్ ఎస్ ఐ లు నాగేశ్వరరావు, బాబా ఫకృద్ధీన్, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం మండల వినియోగదారుల సంఘ సమావేశం

**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 22:** గురువారం మధ్యాహ్నం 2: 30 నిమిషములకు ధర్మవరం కొత్తపేటలో గల గర్ల్స్ హై స్కూల్ నందు ఈ క్రింది కార్యక్రమములు జరిగినవి



1) జాతీయ వినియోగదారుల వారోత్సవాలు జరిగినవి ఇందులో భాగంగా డిజిటల్ న్యాయ పాలన ద్వారా సత్వర, సమర్థ పరిష్కారము అనే అంశంపై వ్యాసరచన పోటీలు గత నెలలో జరిగిన విజేతలకు నేడు అనగా గురువారం ధర్మవరం కొత్తపేటలో గల మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్ నందు జరిగినవి పోటీలో యు. తరిని ప్రథమ, ఎం. నాగ ప్రణీత ద్వితీయ, జె. మధుశ్రీ తృతీయ స్థానములలో వచ్చిన వారికి సర్టిఫికెట్ మరియు మూమెంటు అందచేయడం జరిగినది .కార్యక్రమమునకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రాంప్రసాద్ గారు మరియు ఉపాధ్యాయ బృందం హాజరైనారు జిల్లా వినియోగదారుల సమాచార సమైక్య నుండి వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ గారు రాష్ట్ర వినియోగదారుల సమాచార సమైక్య నుండి బి నారాయణమ్మ గారు ధర్మవరం వినియోగదారుల సమాచార కేంద్రం నుండి అధ్యక్షులు ఎస్ గోవిందు గారు సెక్రటరీ చిన్నతంబి చిన్నప్ప ట్రెజరర్ ఎస్ సుబహాన్ జాయింట్ సెక్రెటరీ గుర్రం వేణుగోపాల్ సభ్యులు పళ్లెం జనార్ధన శ్రీనివాసులు మరియు పాఠశాల విద్యార్థినిలు 390 మంది పాల్గొన్నారు

వినియోగదారు వినియోగదారులు హక్కులు వాటి పరిరక్షణ అనే అంశంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్ గారు మరియు పోలా ప్రభాకర్ గారు బి నారాయణమ్మ చిన్న తంబి చిన్నప్ప పల్లెం జనార్ధన తదితరులు మాట్లాడారు.

## ధర్మవరం రెండో వార్డులో వై సి పి సమావేశం !



**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 22:** ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి ఆదేశాలు మేరకు 2 వ వార్డు శాంతి నగర్ పరిశీలకులుగా బ్రహ్మయ్య, వేముల జయరామి రెడ్డి లను నియమించారు. ఈ మేరకు వారు దిశా నిర్దేశం చేశారు. నూతన వార్డు కమిటీ లను ఏర్పాటు చేశారు.వై సిపి శ్రేణుల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశం లో బ్రహ్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామి రెడ్డి తదితరులు వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామి రెడ్డి మాట్లాడుతూ ధర్మవరం అభివృద్ధి కోసం కృషి చేసిన ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి ఆశయాలు నెరవేర్చుడానికి కృషి చేస్తామన్నారు. ఇందుకు వైసి పి శ్రేణులు అందరూ సహకరించాలని కోరారు.